క్లుప్తంగా

పోలింగ్ కేంద్రం పరిశీలన

ముదిగొండ: మండలపరిధిలోని గోకినేపల్లిలోని పోలింగ్ కేంద్రాన్ని ఖమ్మం ఆర్డీఓ గణేష్ గురువారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలోని వసతులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామారావు, ఎంపీఓ సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి సతీష్ పాల్గొన్నారు.

దివ్యాంగులు, వృద్ధులకు ఉచిత రవాణా

కొణిజర్ల: ఈ నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల ఓటింగ్‌లో పాల్గొనే వయో వృద్ధులు, దివ్యాంగులను పోలింగ్ కేంద్రానికి తీసుకువచ్చేందుకు ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తున్నట్లు ఎంపీడీఓ రోజారాణి తెలిపారు. వేసవికాలం అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఓటింగ్ ప్రక్రియ సాయంత్రం 6 గంటల వరకు పొడిగించినట్లు తెలిపారు. ఓటర్లంతా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కళాకారుడికి సన్మానం

మధిర: విశ్వవిఖ్యాత నటుడు నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల సందర్భంగా గురువారం మధిరలో రామభక్త సీతయ్య కళాపరిషత్ అధ్యక్షులుడుబాబ్లాను ఘనంగా సన్మానించారు. ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల కమిటీ సభ్యులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత పారుపల్లి సురేష్ చేతుల మీదుగా మధిరలో కళాపరిషత్ కార్యదర్శి, మధిర సాంస్కృతిక సారథి, నటుడు మధిర బాబ్లాను శాలువా, మెమెంటోతో సన్మానించారు.

బీఆర్‌ఎస్‌కు జగ్గవరపు సంజీవరెడ్డి రాజీనామా



జగ్గవరపు సంజీవరెడ్డి

సత్తుపల్లి: సీనియర్ బీఆర్‌ఎస్ నేత జగ్గవరపు సంజీవరెడ్డి బీఆర్‌ఎస్ పార్టీకి గురువారం రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తన రాజీనామా లేఖను బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుకు పంపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి మద్దతు ప్రకటించి ప్రచారం చేస్తామని తెలిపారు.

విద్యుత్ భద్రతా వారోత్సవాలు

కారేపల్లి: వినియోగదారులు విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని కొత్తలింగాల ఏడీఏ వైవీ.ఆనందకుమార్ అన్నారు. గురువారం కారేపల్లి, చీమలపాడు విద్యుత్‌శాఖ కార్యాలయాల్లో నిర్వహించిన విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో వారు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఏఈలు విజయ్‌కుమార్, రామకృష్ణ, శరత్‌కుమార్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ మట్టి తవ్వకాలు నిలిపివేయండి

సత్తుపల్లిరూరల్: పట్టణంలోని వేశ్యకాంతల చెరువులో అక్రమ మట్టి తవ్వకాలను నిలిపివేయాలని కోరుతూ ఆయకట్టు రైతులు గురువారం ఆందోళన వ్యక్తం చేశారు. మట్టి తవ్వకాల వల్ల భారీ గోతులు పడి చెరువుకు ప్రమాదం ఏర్పడి అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం నీటిపారుదల శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. గాదె చెన్నారావు, పి.చెన్నారావు, ఆనంద్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

వైరా: గ్రేట్ విజన్ లయన్స్‌క్లబ్ వైరా వారి ఆధ్వర్యంలో వైరాకు చెందిన నిరుపేద రాజుకు గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా.. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. గురువారం వైరాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ కాపా మురళీ కృష్ణ, డాక్టర్ ఉంద్రు శ్యాంబాబు అందించిన నగదును క్లబ్ చైర్మన్ ఉంద్రు వరలక్ష్మి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌సీ లగడపాటి ప్రభాకర్‌రావు, తోటకూర శ్రీకాంత్, గంగవరపు కిషన్‌రాయ్, ఉయ్యూరి రామకృష్ణ, జాలా మహాలక్ష్మి పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ

వైరారూరల్: మండలంలోని పాలడుగు గ్రామంలోని యూత్ సభ్యులు నిరుపేదలకు సాయం చేయలనే లక్ష్యంతో సోషల్‌మీడియా ద్వారా విరాళాలు సేకరించి గురువారం అర్హులైన నిరుపేదలకు బియ్యం, నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. విరాళాలు సేకరించి నిత్యావసరాలు అందించిన యూత్ సభ్యులను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో పాలగుడు యూత్ సభ్యులు పాల్గొన్నారు.

కేసు నమోదు

చింతకాని: మండలంలోని లచ్చగూడెం గ్రామానికి చెందిన చింతల రామారావుపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆస్తి పంపకాల విషయంలో గత మూడేళ్ల నుంచి చింతల వెంకటనారాయణ, అతని ఇద్దరు కుమారుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో బుధవారం రాత్రి వెంకటనారాయణతో తన చిన్న కుమారుడైన రామారావు గొడవ పడి కర్రతో కొట్టడంతో తలకు గాయమైంది. దీంతో వెంకటనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా..

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘురాంరెడ్డి



తల్లాడ: మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘురాంరెడ్డి, పక్కన ఎమ్మెల్యే రాగమయి, నాయకులు

తల్లాడ/కల్లూరురూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఖమ్మం జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. గురువారం తల్లాడ మండలంలోని కలకొడిమ, కుర్నవల్లి, పినపాక, తల్లాడ, మల్లవరం గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. అదే విధంగా కల్లూరు మండలంలోని చెన్నూరులో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్ ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా రఘురాంరెడ్డి మాట్లాడుతూ.. పేద ప్రజల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు కృషి చేస్తుందని, రాష్ట్రంలో ఆరు గ్యారెంటీల హామీ ఇచ్చి ఐదు గ్యారెంటీలు విజయవంతంగా అమలు చేస్తున్నారని ఆయన చెప్పారు. బీజేపీ పాలనలో దేశం అదోగతి పాలైందని దేవుడిపేరు చెప్పి ఓట్లు అడిగే దుస్థితి బీజేపీ నాయకులకు కలిగిందన్నారు. గత పదేళ్ల పాలన సాగించిన బీఆర్‌ఎస్ పార్టీ పేద ప్రజల గురించి పట్టించుకోలేదన్నారు. కేంద్రంలో ఈ సారీ ఇండియా కూటమి అధికారం చేపట్టబోతుందన్నారు. జిల్లాలో సీపీఐ, సీపీఎం, టీడీపీ నాయకుల సహకారంతో భారీ మెజార్టీ రావడం ఖాయమన్నారు. మండలాలు, గ్రామాల్లో ఉన్న సమస్యలను కూడా తాను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే మట్టా రాగమయి మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికలల్లో సత్తుపల్లి నియోజకవర్గాన్ని అన్ని నియోజకవర్గాల కంటే అత్యధిక మెజార్టీ వచ్చే విధంగా కృషి చేయాలని కార్యకర్తలకు, నాయకులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయనకు పలు గ్రామాల ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఆయన వెంట మాజీ డీసీసీబీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, మద్దినేని బేబి స్వర్ణకుమారి, కాంగ్రెస్ నాయకులు రఘుపతిరెడ్డి, వెంకటకోటారెడ్డి, సుధాకర్, నరసింహారావు, రామారావు, బాస్కర్‌రావు, వెంకటేశ్వరరావు, కృష్ణారెడ్డి, నాగన్న, రమేష్, భారతి, కోటిరెడ్డి, రామలింగేశ్వరరావు, పసుమర్తి చంద్రరావు, వెంకటేశ్వరరావు, మోహన్‌రావు, గోపాల్‌రావు, రాజేష్, యాకూబ్ అలి, సత్యనారాయణరెడ్డి, ప్రభాకర్‌రావు, సీపీఎం నాయకురాలు మాచర్ల భారతి తదితరులు పాల్గొన్నారు.

మరోసారి అవకాశం ఇవ్వండి

బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి నామ నాగేశ్వరరావు

మధిర: మరోసారి అవాకాశం ఇస్తే ఖమ్మం జిల్లాను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసుకుందామని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి నామ నాగేశ్వరరావు అన్నారు. గురువారం మధిర పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. మధిర స్విమర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జంగా నరసింహారెడ్డి, కలయిక వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఇరుకుళ్ల బాల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో స్విమ్మర్స్, వాకర్స్‌ను కలిసి ఓట్లు అభ్యర్థించారు. అనంతరం కూరగాయల మార్కెట్, మధిర మెయిన్ రోడ్‌లో ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా కొండా టీస్టాల్ వద్ద టీ తాగారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట జెడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు, నాయకులు వెంకటేశ్వరరావు, జయాకర్, కృష్ణ ప్రసాద్, శ్రీనివాసరావు, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



స్టాల్ వద్ద టీ తాగుతూ..
ప్రచారం చేస్తున్న నామ నాగేశ్వరరావు

ముమ్మరంగా ఉపాధి పనులు నిర్వహించాలి



సమావేశంలో పాల్గొన్న
అడిషనల్ డీఆర్‌డీఓ శిరీష, అధికారులు

ఎర్రుపాలెం: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం పనులను ముమ్మరంగా నిర్వహించాలని అడిషనల్ డీఆర్‌డీఓ శిరీష ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఈజీఎస్ సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ఉపాధి పనుల్లో కూలీల సంఖ్యను గణనీయంగా పెంచాలని, కూలీలకు ఎక్కువ వేతనం పొందే విధంగా పనులు చేయించాలని సూచించారు. మండల కేంద్రంలో ప్రతిపాదనలో ఉన్న ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ కోసం ఎంపిక చేసిన భవనాన్ని ఆమె పరిశీలించారు. ఈ సమావేశంలో క్లస్టర్ ఏపీడీ సీహెచ్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ సురేందర్, ఈజీఎస్ ఏపీఓ కె.నాగరాజు, ఎంపీఓ శ్రీలక్ష్మీ, ఈజీఎస్ సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలిస్తే ఉపాధికి గ్యారంటీ



కూలీలతో మాట్లాడుతున్న
ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

కారేపల్లి: ఉపాధిహామీ పథకం కొనసాగాలంటే కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ అన్నారు. గురువారం కారేపల్లిలో కాంగ్రెస్ అభ్యర్థి విజయాన్ని కాంక్షిస్తూ.. సీపీఎం, సీపీఐ, టీడీపీ, కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కారేపల్లిలోని చెరువు వద్ద ఉపాధి కూలీలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాసేపు కూలీలతో కలిసి పనిచేశారు. ఆయన మాట్లాడుతూ.. ఉపాధి పనులను నిర్వీర్యం చేస్తున్న మోదీ ప్రభుత్వానికి ఈ సారి ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. శ్రమ విలువ తెలిసిన వాడినని శ్రామికులకు అండగా ఉంటానన్నారు. రైతులకు రైతుభరోసా పైకం బ్యాంకు ఖాతాల్లో వేసిందని రైతుల రుణమాఫీ ఆగస్టు 15లోపు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ హస్తం గుర్తుపై ఓటు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు భూక్యా వీరభద్రం, నాగేశ్వరరావు, టీడీపీ నాయకుడు ముఖర్జీ, కాంగ్రెస్ నాయకులు మంజుల, తిరుపతిరావు, వీరప్రతాప్, దేవ్లానాయక్, నాగేశ్వరరావు, వీరాలాల్, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్, రాములు, బీముడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్ షోను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న
మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

కల్లూరు: బీఆర్‌ఎస్ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ కల్లూరులో శుక్రవారం చేపట్టనున్న బైక్ ర్యాలీ, రోడ్ షోలను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. గురువారం మండలంలోని బొప్పన రామారావు నివాసంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శుక్రవారం సాయంత్రం ఐదుగంటలకు నిర్వహించే రోడ్ షోకు నామ, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రఘు, జెడ్పీటీసీ అజయ్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు రామారావు, రఘు, లక్ష్మణరావు, కృష్ణ, మల్లేశ్వరరావు, రామకృష్ణ, ప్రసాద్, వెంకటరత్నం, కిరణ్, రవూఫ్ తదితరులు పాల్గొన్నారు.

చర్చి ప్రారంభోత్సవ వేడుకలు

తల్లాడ: మండలంలోని కుర్నవల్లి పునీత చిన్న తేరోజమ్మ చర్చి ప్రారంభోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పాల్గొని మాట్లాడారు. దేవుని ఆశీస్సులతో అందరూ సంతోషంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో తల్లాడ జెడ్పీటీసీ ప్రమీల, పీఏసీఎస్ అధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీ, దాసురావు, వెంకటయ్య, శివారెడ్డి, శ్రీను, రవి పాల్గొన్నారు.

ప్రచార పర్వం — రఘురాంరెడ్డిని గెలిపించండి



ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

వైరా: ఖమ్మం పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆర్ రఘురాంరెడ్డిని గెలిపించాలని కోరుతూ గురువారం వైరాలోని 5, 6 వార్డులలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మాజీ రాష్ట్ర కార్యదర్శి కట్ల సంతోష్, వెంపటి రంగారావు, పూర్ణ, బొగ్గారపు రామారావు, ఆవుల రవి, లింగయ్య, వంశీ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని గద్దె దింపాలి..

వైరారూరల్: బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపడమే ఇండియా కూటమి లక్ష్యమని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు భూక్యా వీరభద్రం అన్నారు. మండలంలోని స్నానాల లక్ష్మీపురం, సిరిపురం, పూసలపాడు, విప్పలమడక, లింగన్నపాలెం, గరికపాడు, దాచాపురం, ఖానాపురం, గన్నవరం, కొండకొడిమ, రెబ్బవరం తదితర గ్రామాల్లో గురువారం వామపక్ష పార్టీలు బలపర్చిన పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురామిరెడ్డి విజయాన్ని ఆకాంక్షిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో విప్పలమడక మాజీ సర్పంచ్ జాన్‌పాపయ్య, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, అర్జున్‌రావు, వీరభద్రం పాల్గొన్నారు.

కొణిజర్ల: రఘురాంరెడ్డి విజయానికాంక్షిస్తూ.. గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు బానోత్ భరత్, సీపీఐ మండల కార్యదర్శి వేములకొండ రమేష్ గురువారం మండలంలో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే జిల్లా సమగ్రాభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ పాపగంటి సుదర్శన్, మాచర్లనాగభూషణం, నాగయ్య, వెంకటయ్య, రాంబాబు, సాయి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకుల ప్రచారం

కారేపల్లి/ఎర్రుపాలెం: బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి నామ నాగేశ్వరరావును గెలిపించాలని బీఆర్‌ఎస్ శ్రేణులు కోరారు. గురువారం కారేపల్లి మండలంలోని విశ్వనాథపల్లి, దుబ్బతండా,మేకలతండా గ్రామాల్లో ప్రచారం చేశారు. అదే విధంగా ఎర్రుపాలెం మండలంలోని భీమవరం, గుంటుపల్లి గోపవరం తదితర గ్రామాల్లో మధిర ఏఎంసీ మాజీ చైర్మన్ రామకృష్ణ, జెడ్పీటీసీ కవిత, మండల అధ్యక్షుడు సాంబశివరావుల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు,వీరేందర్, మత్రు, కోటేశ్వరరావు, కుమార్, శ్రీకాంత్, శ్రీనివాసరావు, సాంబశివరావు, కిషోర్, సురేష్, కృష్ణారావు, కాలేశ్వరరావు, రవి, నర్సింహారావు పాల్గొన్నారు.

బీజేపీని గెలిపించాలి..

కల్లూరు: మండలంలోని కొత్త నారాయణపురం గ్రామంలో బీజేపీ నాయకులు ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలను కలిసి మజ్జిగ పంపిణీ చేశారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ సత్తుపల్లి నియోజకవర్గ కన్వీనర్ భాస్కర్ని వీరంరాజు, కిసాన్ జిల్లా మోర్చా కార్యదర్శి కృష్ణమోహన్, మండల ప్రధాన కార్యదర్శులు పుల్లారావు, అనీల్, ఐటీసెల్ కన్వీనర్ రెడ్డి వినయ్, కృష్ణయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మల్లవరం గ్రామంలో..

తల్లాడ: మండలంలోని మల్లవరం గ్రామంలో బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు విజయాన్ని కాంక్షిస్తూ.. బీజేపీ మండల అధ్యక్షుడు ఆపతి వెంకటరామారావు ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతీ ఒక్కరూ కమలం గుర్తుపై ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ, టీడీపీ నాయకులు కూచిపూడి వెంకటేశ్వర్లు, గాదె కృష్ణారావు, చౌడా నాగేశ్వరరావు, ఎల్లంకి సుధాకర్, చల్లా వెంకటి, తమ్మిశెట్టి కృష్ణ, సున్నా రామారావు, కొమ్మినేని సత్యనారాయణ, పెరికె వెంకటేశ్వర్లు, మొక్కా కృష్ణార్జున్ పాల్గొన్నారు.

కేంద్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే



ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాగమయి,
పొంగులేటి శ్రీలక్ష్మి

సత్తుపల్లిటౌన్: కేంద్రంలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని.. కావున ప్రతి ఒక్కరూ హస్తం గుర్తుపై ఓటు వేయాలని ఎమ్మెల్యే మట్టా రాగమయి, పొంగులేటి శ్రీలక్ష్మి తెలిపారు. గురువారం పట్టణంలోని 2, 4, 6 వార్డుల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ తోట సుజలరాణితో కలిసి వారు ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలే ప్రజలకు శ్రీరామరక్ష అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ముత్తారెడ్డి, కమల్‌పాషా, నర్సింహారావు, గణేష్, చెన్నారావు, నాగభూషణం, శ్రీనివాసరెడ్డి, పద్మజ్యోతి, రాములు పాల్గొన్నారు.

రఘురాంరెడ్డి గెలుపునకు కృషి చేయాలి



ముదిగొండ: మాట్లాడుతున్న మల్లిబాబుయాదవ్

చింతకాని/ముదిగొండ: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘురాంరెడ్డిని గెలిపించేందుకు కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు జమ్ముల జితేందర్‌రెడ్డి సీపీఐ, సీపీఎం నాయకులకు సూచించారు. గురువారం మండలంలోని నేరడ గ్రామంలో నిర్వహించిన సీపీఐ, సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అదే విదంగా రాఘురాంరెడ్డిని గెలిపించాలని ముదిగొండలోని గురువారం గొల్ల, కురమ, యాదవ సంఘం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్ మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కురుమ, యాదవులను మోసం చేసిందని విమర్శించారు. ఈ సమావేశంలో సీపీఐ, సీపీఎం మండల కార్యదర్శులు పావులూరి మల్లికార్జున్‌రావు, మడుపల్లి గోపాలరావు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాయకులు కిషోర్, మనోహర్‌బాబు, గోవిందరావు, నాగార్జున్, శ్రీను, నాగేశ్వరరావు, వెంకయ్య, నాగయ్య, నారాయణ, సీపీఐ నాయకులు రవి, గోపాలరావు, దస్తగిరి, ప్రభాకర్, సీపీఎం నాయకుడు కిరణ్, సీపీఎం మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, నాయకులు రామకృష్ణ, శ్రీనివాసరావు, కన్నయ్య, పురుషోత్తం, రవి, రాజులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

కల్లూరు: కల్లూరు మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఖాన్‌ఖాన్‌పేటలో గురువారం ఎమ్మెల్యే మట్టా రాగమయి, పొంగులేటి శ్రీలక్ష్మి, మండల కాంగ్రెస్ నాయకుల సమక్షంలో బీఆర్‌ఎస్ నుంచి పలు కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలోకి చేరాయి. వారందరికీ ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం నిర్వహించిన ప్రచారంలో కాంగ్రెస్ పథకాలను వివరిస్తూ.. కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డిని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పసుమర్తి చందర్‌రావు, భాగం ప్రభాకర్‌రావు, బాబు, శ్రీను, ఖాళీదాసు పాల్గొన్నారు.

గన్నవరం గ్రామంలో..



కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న
ఎమ్మెల్యే రాందాస్ నాయక్

వైరారూరల్: మండలంలోని గన్నవరం గ్రామంలో ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ సమక్షంలో ఎంపీటీసీ సౌజన్య, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లుతో పాటు సుమారు 100 కుటుంబాలు బీఆర్‌ఎస్ సభ్యత్వానికి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికీ ఎమ్మెల్యే కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కట్ల రంగారావు, శీలం వెంకటనర్సిరెడ్డి, దాసరి దానియేలు, ఏడునూరి సీతరాములు, దొడ్డా పుల్లయ్య, పొదిలి హరినాథ్, పమ్మి అశోక్, బోళ్ల గంగారావు, మట్టూరి కృష్ణారావు, కట్ల నాగరాజు, కట్ల సంతోష్, పల్లపు కొండలు తదితరులు పాల్గొన్నారు.

చిన్నకోరుకొండి దారుగా బంజరు గ్రామంలో..



నాగేశ్వరరావును కాంగ్రెస్‌లోకి
ఆహ్వానిస్తున్న పార్లమెంట్
అభ్యర్థి రాఘురాంరెడ్డి

కల్లూరురూరల్: మండలంలోని చిన్నకోరుకొండి దారుగా బంజరు గ్రామానికి చెందిన బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండలంలో ప్రచారం కోసం వచ్చిన రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే రాగమయి ఆధ్వర్యంలో గురువారం ఆయన పార్టీలో చేరాడు.

పచ్చని చెట్లు నేలమట్టం

వైరారూరల్: ఆగంతకుల ఆగడాలకు భారీ వృక్షాలు కూలిపోతున్నాయి. రెబ్బవరం గ్రామ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు భారీ మర్రి చెట్టుకు మొదలు భాగంలో నిప్పు పెట్టడంతో మరో వృక్షం బలి అయ్యింది. ఇప్పటికే ఈ రోడ్డులో పదుల సంఖ్యలో వృక్షాలు అగ్నికి ఆహుతైన నేపథ్యాన ఇటుగా రాకపోకలు సాగించే ప్రయాణికులు ఎండ వేడిని భరించలేక అల్లాడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి సమస్య పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



నిప్పు పెట్టడంతో నేలకొరిగిన భారీ వృక్షం

ఏకగ్రీవం.. ఏదీ సాయం !

- జిల్లాలో 75 జీపీలకు అందని ప్రోత్సాహం
- పదవీకాలం పూర్తి అయిన మంజూరు కాని నిధులు
- కాంగ్రెస్ ప్రభుత్వమైనా అందించాలని విన్నపాలు



ఏకగ్రీవంగా పాలకవర్గం ఎన్నికైన కోరట్లగూడెం పంచాయతీ

కల్లూరురూరల్: ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామ పంచాయతీలకు ప్రకటించిన ప్రోత్సాహకాలు రాష్ట్ర ప్రభుత్వం ఎగనామం పెట్టింది. గ్రామ పంచాయతీలకు పోటీ లేకుండా పాలకవర్గాలను ఎన్నుకున్నట్లైతే రూ.10 లక్షలు నగదు ప్రోత్సాహకాలుగా ఇస్తామని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రకటించింది. అంతకు ముందు ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు ఏకగ్రీవ గ్రామ పంచాయతీలకు రూ.7 లక్షలు ప్రోత్సాహకాలుగా ఇచ్చేవి. వీటికి అదనంగా మరో రూ.3 లక్షలు కలిపి మొత్తం రూ.10 లక్షలు నగదు ప్రోత్సాహకంగా ఇస్తామని 2019 గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా ప్రభుత్వం ప్రకటించింది. ఇదే కాకుండా అదనంగా ఎమ్మెల్యే నిధుల నుంచి మరో రూ.5 లక్షలు మొత్తం కలిపి రూ.15 లక్షలు గ్రామాల అభివృద్ధికి మంజూరు చేస్తామని చేసిన వాగ్దానం గాలికి కొట్టుకుపోయింది. గ్రామ పంచాయతీల అభివృద్ధికి మొత్తం రూ.15 లక్షలు వస్తుండటంతో స్థానిక సంస్థల్లో పోటీ లేకుండా అనేక గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. ఈ విధంగా ఖమ్మం జిల్లాలోని 589 గ్రామ పంచాయతీలలో 73 పంచాయతీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి.


పదవీకాలం పూర్తయినా అందని నిధులు..

గ్రామ పంచాయతీల పదవీకాలం పూర్తిగా నిర్వహించినప్పటికీ ఈ ఐదేళ్ల కాలంలో ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహక నగదు అందకపోవటం శోచనీయం. జీపీలకు ఎన్నికలు జరిగిన కొత్తలో ప్రభుత్వం, ఎమ్మెల్యే నిధుల నుంచి మొత్తం 15 లక్షలు వస్తాయనే ఉద్దేశ్యంతో సర్పంచ్‌లు వడ్డీలకు తెచ్చిమరీ అభివృద్ధి పనులు చేపట్టారు. తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరుగుతున్నాయే తప్ప.. నిధులు మాత్రం విడుదల కాలేదు. దీంతో సర్పంచ్‌లు ఎమి చేయాలో అర్థం కాక ఆర్థికంగా కృంగిపోతున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం బాకీ ప్రోత్సాహకాలు ఇస్తుందా..

ఏకగ్రీవ జీపీలకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మొండి చేయి చూపించింది. అదే విధంగా ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డ గ్రామ పంచాయతీల పాలకవర్గాల పదవీకాలం కూడా పూర్తయింది. కనీసం నూతన కాంగ్రెస్ ప్రభుత్వమైన భాకీ నిధులు మంజూరు చేస్తే.. వచ్చే సర్పంచ్ ఎన్నికల్లో మరిన్ని గ్రామాలు ఏకగ్రీవమయ్యే అవకాశముంది.


ఆశగా ఎదురు చూశాం..



ఏకగ్రీవ పంచాయతీలకు రూ.10 లక్షలు నగదు ప్రోత్సాహక బహుమతులు అందిస్తామని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చెప్పింది. కానీ అవి తమ పదవీకాలం అయిపోయినప్పటికీ అందలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వం ప్రకటించిన నగదు ప్రోత్సాహకాలను గ్రామ పంచాయతీ ఖాతాలో జమ చేయాలి.

– బైరెడ్డి నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్, కొర్లగూడెం

ప్రోత్సాహం అవసరం..



గ్రామ ప్రాంతాల్లో రాజకీయాల్లో పోటీ లేకుండా ఏకగ్రీవంగా ఒక మంచి వాతావరణం నెలకొల్పాలనే ఉద్దేశ్యంతో గత ప్రభుత్వం నగదు ప్రోత్సాహకాలు ప్రకటించింది. కానీ రాష్ట్ర ప్రభుత్వం తమ పదవీకాలం పూర్తయ్యేలోగా ఇవ్వలేక పోయింది. ప్రభుత్వం చెప్పిన మాట ప్రకారం రూ.10 లక్షలు ఇచ్చినట్లెయితే గ్రామాలు మరింత అభివృద్ధి చెందేవి.

– దేవరపల్లి అరుణ, మాజీ సర్పంచ్, లింగాల